బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్, ఎంపీ వంశీకృష్ణ, కలెక్టర్ కుమార్‌దీపక్

15 రోజులు అందుబాటులో ఉన్నా..

ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, సెప్టెంబర్ 25 : గత మూడు నెలల్లో 15 రోజులు ప్రజలకు అందుబాటులో ఉన్నానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్కొన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూడు నెలల్లో 15 రోజులు ప్రజలకు అందుబాటులో ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొనడంపై సొంత పార్టీ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎల్లంపల్లి మంచి నీటి ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ సభలో కూడా నెలలో 10 రోజులు స్థానికంగా ఉంటానని పేర్కొనడం చర్చనీయాంశమైంది. స్థానికంగా ఉండడం లేదని ఆయన పరోక్షంగా బహిరంగ సభల్లో ప్రకటించడంపై సొంత పార్టీ నాయకులే పెదవి విరుస్తున్నారు. ప్రతి సమావేశంలో రోజుల లెక్కలతో సహా చెప్పుకోవడం ఆ పార్టీ నాయకులకు మింగుడుపడడం లేదు.

న్యాస్ సర్వేలో జిల్లాను ముందుంచాలి

దండేపల్లి, సెప్టెంబర్ 25 : జాతీయ సాధన సర్వేలో (న్యాస్) మన జిల్లాను అగ్రగామిలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం బీసగోని శంకర్‌గౌడ్ సూచించారు. దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం మాట్లాడుతూ డిసెంబర్‌లో నిర్వహించనున్న న్యాస్ జాతీయ సర్వేలో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధిస్తే పాఠశాలలో మౌళిక వసతులు మరింత మెరుగుపడుతాయన్నారు. ఈ నెలలో పదవి విరమణ చేయబోతున్న హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాత రమేశ్, ఇప్ప రవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి అప్పాల మనోహర్, రిసోర్స్ పర్సన్లు బీ.రాజన్న, రమేశ్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో నలుగురికి ఆరు నెలల జైలు

రూ.4 వేల జరిమానా

జన్నారం/ఎదులాపురం, సెప్టెంబర్ 25: ఎస్సీ, ఎస్టీ కేసులో ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాంప్రసాద్ తీర్పును వెలువరించినట్లు మంచిర్యాల కోర్టు లైజన్ అధికారి సయ్యద్ తాజొద్దీన్ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జిల్లా జన్నా రం పోలీస్ స్టేషన్ పరిధిలో 16 మే 2020న తమ బంధువును తీసుకెళ్లాడని కోపంతో ఎస్సీ మాల కులానికి చెందిన బాట్ల అన్వేశ్(17) యువకుడిని నేరస్తులు గారిపెల్లి హరీశ్ కుమార్ గౌడ్, ముత్యం సాయి, పట్కూట్ ప్రశాంత్, మహ్మద్ అజ్మత్ ఖాన్ దాడి చేసి గాయపరిచారు. కులం పేరుతో దూషిం చి చంపుతానని బెదిరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి జన్నారం ఎస్ఐ ఎం వినోద్‌కుమార్ కేసు నమోదు చేశారు. మంచిర్యాల సబ్ డివిజన్ ఇన్‌చార్జి జైపూర్, ఏసీపీ జీ నరేందర్ దర్యాప్తు చేసి పై నలుగురిపై వివిధ సెక్షన్ కింద కోర్టులో దాఖలు చేశారు. సీడీవో ఇప్తేకార్ అహ్మద్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముస్కు రమణారెడ్డి 17 మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయగా నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితులకు శిక్ష విధించడంలో కృషి చేసిన జన్నారం ఎస్ఐ రాజవర్ధన్, సీఐ లక్సెట్టిపేట నరేందర్‌ను కోర్టు విధుల అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఐపీఎస్ ఐజీ, మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఐపీఎస్, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ అభినందించారు.

వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, సెప్టెంబర్ 25: వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారి సంక్షేమం అందరి బాధ్యత అని కుమ్రం భీం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల అవగాహన, వినోదాల వారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 26న వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం, ఆరోగ్య రక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులతో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే, మానవ సంబంధాలు-విలువలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబర్ 1న కలెక్టరేట్‌లో పెద్ద సంఖ్యలో వయోవృద్ధులతో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా స్థాయి ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం అందరితో వయోవృద్ధుల సంక్షేమ ప్రతిజ్ఞ చేయించి ప్రత్యేక కార్యక్రమాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు గుండ శంకర్, పెద్దింటి లక్ష్మణరావు, విజయ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధు సంక్షేమం కోసం పోషణ నియామవళి

నస్పూర్, సెప్టెంబరు 25 : వయోవృద్ధుల పోషణ, సంక్షేమం కోసం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోషణ సంక్షేమ నియామవళి కార్యక్రమాన్నినిర్వహిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంక్షేమ నియామవళి 2011 కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వరూపారాణి, సీనియర్ సిటిజన్ సభ్యులు మహేందర్, హబ్ సమన్వయకర్త సౌజన్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం సాధించాలి..

మంచిర్యాలను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి సత్యనారాయణతో కలిసి డీఆర్‌పీలు, లయన్స్‌క్లబ్ సభ్యులతో న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సెర్ప్, మెప్మా సిబ్బంది కృషి చేయాలన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

జన్నారం, సెప్టెంబర్ 25 : మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను మండల అధికారులు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటుగా ప్రభుత్వ సూచించిన ప్రతి రోజూ మెనూ పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటుగా పిలలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో జలెందర్, కార్యదర్శి రాహుల్, ప్రిన్సిపాల్ శివరామరాజు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

దండేపల్లి, సెప్టెంబర్25: ఈ నెల 24న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మందమర్రిలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగంలో ఎస్.హర్షవర్ధన్(8వతరగతి), టీ.సృజన్ (8వతరగతి), అండర్-17విభాగంలో ఎన్.శ్రీనాథ్ పాల్గొని జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శంకర్‌గౌడ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ సూరం రవి, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 25 : సిర్పూర్(టీ) మండల నూతన మండల విద్యాధికారిగా (ఎఫ్ఏసీ) డీ వేణుగోపాలరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు వేణుగోపాలరావు మండలంలోని వేంపల్లి జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నా డు. ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాలరావును వెంపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 25 : ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి (డీపీఆర్ఈ) ప్రభాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని పారిశుధ్యం, ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చంద్రయ్య, హెచ్‌ఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా

కాసిపేట, సెప్టెంబర్ 25 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా నమోదు చేశారు. మండలంలో ఆయా పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూ వర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్న మండలంలోని 78 మంది కార్మికులకు ప్రమాద బీమా రూ.10 లక్షలు వర్తించేలా పంచాయతీ నిధుల నుంచి ప్రతి ఒక్కరికీ రూ.549 చొప్పున చెల్లించి ప్రమాద బీమా చేయించారు. ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్థర్ అలీ సమక్షంలో బీమా చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూ వర్కర్స్ పాల్గొన్నారు.

కాసిపేట ఎంఈవోగా వెంకటేశ్వర స్వామి

కాసిపేట, సెప్టెంబర్ 25 : కాసిపేట మండల విద్యాధికారిగా ముత్యంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముక్తవరపు వెంకటేశ్వర స్వామిని నియమిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన ఎంఈవో వాసాల ప్రభాకర్ కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా నుంచి కాసిపేటకు బదిలీపై వచ్చిన వెంకటేశ్వర స్వామికి ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. కాసిపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం మామిడిపెల్లి సాంబమూర్తి, దేవాపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ రమేశ్, ధర్మారావుపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్ నాయక్, ఎంఆర్సీ సిబ్బంది సీసీవో రాంబాబు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సౌజన్య హర్షం వ్యక్తం చేశారు.

కుమ్రం భీం ఉత్సవ కమిటీ కార్యవర్గం

కెరమెరి, సెప్టెంబర్ 24:కుమ్రం భీం 84వ వర్ధంతి ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం మండలంలోని జోడేఘాట్ గ్రామంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుమ్రం సోనేరావ్, అధ్యక్షుడిగా పెండోర్ రాజేశ్వర్, కన్వీనర్‌గా పెండోర్ మోతీరాం, కార్యదర్శులుగా మడవి రఘునాథ్, చహకటి మారు, ప్రభాకర్, భరత్ భూషణ్, ప్రచార కార్యదర్శులుగా లింగోరావ్, గోవింద్ రావ్, కోశాధికారులుగా రాయిసిడాం జంగు, కోవ విజయ్ కుమార్‌తో పాటు సలహాదారులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నర్సరీ కార్మికులకు లాభాలవాటా చెల్లించాలి

రెబ్బెన, సెప్టెంబర్ 25: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న నర్సరీ కార్మికులందరికీ లాభాలవాటా చెల్లించాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఏరియాలోని గోలేటి సింగరేణి నర్సరీలో బుధవారం సాయంత్రం నర్సరీ కార్మికులను కలిసిన అనంతరం మాట్లాడారు. యూనిట్ రేటున విధులు నిర్వహిస్తున్న నర్సరీ కార్మికులకు, వాహన డ్రైవర్లకు, ఓబీ కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటాను యాజమాన్యం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ధరావత్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, కేంద్ర కమిటీ సభ్యులు మాంతు సమ్మయ్య, ఓరం కిరణ్, సత్యనారాయణ, బాబురావు, బొంగు వెంకటేశ్, రమేశ్, తదితరులున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 25 : సింగరేణిలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ బుధవారం డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడి శ్రమ ఉందని యాజమాన్యం గుర్తించాలన్నారు.

వేతనాలు పెంచాలి

రెబ్బెన, సెప్టెంబర్ 25: సింగరేణి లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం కోరారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయం వద్ద సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఏరియా జీఎం శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించిన మాట్లాడారు. రాష్ట్ర నాయకులు బండారి తిరుపతి, ఏరియా నాయకులు శ్రీను, పోశం, తిరుపతి, కుమార్, సోమయ్య, లక్ష్మణ్, పద్మ, లక్ష్మి, ఇంద్ర, రాణి, పోసుబాయి, శంకరమ్మ, సావిత్రి, నాగలక్ష్మి, ఉన్నారు.

స్ప్రే వాహనం ప్రారంభం

రెబ్బెన, సెప్టెంబర్ 25: కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఖైర్‌గూడ ఓసీపీ నుంచి సీహెచ్‌పీ వరకు నూతన స్ప్రే వాహనాన్ని ప్రారంభించినట్లు ఖైర్‌గూడ పీవో మచ్చగిరి నరేందర్ తెలిపారు. ఈ యంత్రాన్ని వినియోగించుకొని రోడ్లపై దుమ్మూ దూళి నిర్మూలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శంకర్‌నాయక్, ఏఐటీయుసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మీస చంద్రశేఖర్, పీఈ వీరన్న, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి మేనేజర్ నారాయణ, సూర్యనారాయణ, సీనియర్ పీవో వేణు, కాంట్రాక్టర్ రాజు, తదితరులున్నారు.

ఈపీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 25: ఈపీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఓసీపీలో ఈపీ ఆపరేటర్ల సమావేశాన్ని నిర్వహించి సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో నాయకులు జూపాక రాంచందర్, రాచర్ల చంద్ర మోహన్, మోతె లచ్చన్న, బద్రి బుచ్చయ్య, అఫ్రోజ్‌ఖాన్, మూల సుధాకర్, మోహన్‌రెడ్డి, మల్లెత్తుల శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, దుబాల రవి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయండి

- 'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు'లను రెగ్యులర్ చేయాలి
- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ విజ్ఞప్తి

వేములవాడ, సెప్టెంబర్ 25: దేవాదాయశాఖ ఉద్యోగులకు ఇప్పటికే నాలుగు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, కనీసం మూడింటిని ఈ పండుగలోగా విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, 261 జీవోను సవరించి ఉద్యోగులందరినీ ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చి న్యాయం చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని హోటల్ ఎస్‌ఆర్‌ఆర్ గ్రాండ్‌లో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేవాదాయ శాఖలో 1975 నాటి క్యాడర్ స్ట్రెంత్‌నే ఇప్పటికీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఆలయాల్లో భక్తుల రద్దీ, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ఐదేండ్లకోసారి క్యాడర్ స్ట్రెంత్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీచేసి ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని చెప్పారు.

రైతులకు కంగన క్షమాపణ

రైతు చట్టాలపై వ్యాఖ్యలు వెనక్కి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25: తన దురుసు వ్యాఖ్యలతో నోరు పారేసుకున్న నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ రైతులకు క్షమాపణ చెప్పారు. 2021లో కేంద్రం రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలంటూ ఆమె ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వివాదాస్పద రైతు చట్టాలపై తాను చేసిన వ్యాఖ్యలు చాలామందిని అసంతృప్తి, బాధకు గురి చేశాయని, దీనికి తనను క్షమించాలని ఆమె కోరారు. 'కొద్ది రోజుల క్రితం రైతు చట్టాలపై మీడియా నన్ను కొన్ని ప్రశ్నలు వేసింది. గతంలో రద్దు చేసిన మూడు రైతు చట్టాలను తిరిగి తేవాలని నేను ప్రధాని మోదీని కోరుతానని చెప్పా. అయితే నేను చేసిన ఈ ప్రకటన చాలామందిని బాధించింది. నా ప్రకటన వెనక్కి తీసుకుంటూ క్షమాపణలు చెబుతున్నా. నేనొక బీజేపీ కార్యకర్తను. నేను చేసే ప్రకటనలు పార్టీ అభిప్రాయాన్ని ప్రతిబింబించేవిగా ఉండాలి తప్ప, వ్యక్తిగతంగా ఉండకూడదు' అని ఆమె ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కాగా, కంగనా చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటికి పార్టీతో సంబంధం లేదని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అంతకుముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రైవేటు భవనానికి సర్కారీ సోకులు!

- శంషాబాద్ డబ్ల్యూటీసీ భవనంలో ఏఐ ఫెసిలిటీ సెంటర్
- అసంపూర్తి నిర్మాణంలో తాత్కాలిక కేంద్రం
- ట్రై సిటీల్లో అందుబాటులో సర్కారీ భవనాలు
- కపిల్ గ్రూపుతో ఐటీశాఖ ఒప్పందంపై ఆరోపణలు

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

ప్రత్యేక కథనం - 8

ఈ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే మాకు వాట్సాప్ చేయండి
91827 77711

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్.. ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఏఐ సిటీ నిర్మాణ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేస్తున్న సెంటర్. అంటే తాత్కాలిక కేంద్రమన్న మాట. ప్రభుత్వ పరంగా టీ-హబ్, టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ.. ఇలా చెప్పుకుంటూ పోతే లక్షల చదరపు అడుగుల్లో విశాలమైన , అద్భుతమైన భవనాలు అందుబాటులో ఉండగా అసంపూర్తి అద్దె భవనంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎప్పుడు పూర్తవుతుందో తెలియని ఈ భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్‌ను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి రానున్న రోజుల్లో ఎంతో ప్రాధాన్యం ఉండనుందని కేసీఆర్ ప్రభుత్వం ఆదిలోనే గుర్తించింది. అందుకే హైదరాబాద్ వేదికగా ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024 నిర్వహించేందుకు గతంలోనే చొరవ తీసుకుంది. కొన్నిరోజుల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏఐ ప్రాధాన్యత దృష్ట్యా 'ఏఐ గ్లోబల్ సమ్మిట్-2024'ను నిర్వహించింది. ఈ క్రమంలోనే ఏఐ సిటీని ఏర్పాటు చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు, పురోగతి, ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ పర్యవేక్షించేందుకు ఒక కేంద్రం కావాలి. అదే ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్. దీనిని ఏర్పాటు చేస్తున్నట్టు సమ్మిట్ వేదికగానే రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. కాకపోతే ఆ కేంద్రాన్ని శంషాబాద్‌లోని ప్రపంచ వాణిజ్య కేంద్రం (వరల్డ్ ట్రేడ్ సెంటర్)లోని రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇదే అందరినీ విస్మయానికి గురి చేసింది.

ఇంతకీ ఏమిటీ డబ్ల్యూటీసీ?

దేశంలోనే అతిపెద్ద వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామంటూ జూన్ 2022 నగరానికి చెందిన కపిల్ గ్రూపు ఆర్భాటంగా ప్రకటించింది. శంషాబాద్ విమానాశ్రయం తూర్పు ముఖం దగ్గర శ్రీశైలం హైవేను అనుకొని 50-60 ఎకరాల్లో 12 అంతస్తులతో కూడిన భవనాన్ని నిర్మిస్తామని చెప్పింది. ఇందుకోసం సుమారు రూ.4 వేల కోట్లను పెట్టుబడిగా పెడుతున్నట్టు ప్రకటించింది. కారణాలు ఏవైనా ఆ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదు. కేవలం గ్రౌండ్ ఫ్లోర్ సహా మూడు అంతస్తులతో కూడిన రెండు టవర్ల నిర్మాణం మాత్రమే ఇప్పటికీ పురోగతిలో ఉంది. అంటే మూడేండ్ల కిందట మొదలుపెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం వేగంగా పనులు కొనసాగించినా ప్రాజెక్టు పూర్తయ్యేందుకు మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. ఇలాంటి అసంపూర్తి భవనాల్లో ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఒప్పందంలోని షరతులేమిటో?

శంషాబాద్ విమానాశ్రయం తూర్పు వైపు నిర్మిస్తున్న డబ్ల్యూటీసీ శంషాబాద్ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం వచ్చే ఏడాది అక్టోబర్ నాటికి పూర్తవుతుందని కంపెనీ చెప్తున్నది. అలాంటప్పుడు ఏడాది తర్వాత పూర్తయ్యే భవనంలో ఏఐ సిటీ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. ఆ మేరకు ఒప్పందం కూడా పూర్తయినట్టు తెలుస్తున్నది. అయితే, ఆ ఒప్పందంలో ఏముందనేది మాత్రం బయటికి రావడం లేదు. ఏడాదికి గాని పూర్తికాని భవనంలో తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయాలనుకోవడం ఒక ఎత్తయితే, ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం తరపున సదరు గ్రూపునకు ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు ఏమిటన్నవి తెలియరాలేదు. భవనం పూర్తయ్యాక సెంటర్ ఏర్పాటు చేస్తారా? లేదంటే భవనం పూర్తికి ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత అందిస్తారా? అసలు ఆ భవనాన్ని ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇలా అనేక సందేహాలు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

టీ హబ్ కేంద్రంగా 60కి పైగా ఏఐ స్టార్టప్‌లు

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ-హబ్ అంతర్జాతీయస్థాయిలో టెక్నాలజీ స్టార్టప్‌లకు కేంద్రంగా మారింది. ఐటీ కారిడార్‌లో అత్యంత విశాలమైన ప్రాంగణంలో ఉన్న టీ-హబ్‌లో రకరకాల టెక్నాలజీ స్టార్టప్‌లు ఉన్నాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కి సంబంధించిన టెక్నాలజీ స్టార్టప్‌లే 60కి పైగా ఉన్నాయి. ఇక్కడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏఐ స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రత్యేకంగా వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. స్టార్టప్‌లకు, ఐటీ కంపెనీలకు ఎంతో అనుకూలంగా ఉండే ఏఐ ఫెసిలిటీ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఐటీ శాఖకే చెందిన భవనం కావడంతో పైసా ఖర్చు లేకుండా ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటవుతుంది. టీ-వర్క్స్, ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో అనేక భవనాలు ఉన్నాయి. సర్కారు మనసు పెడితే రెండు లక్షల చదరపు అడుగులు సులువైన ప్రక్రియ. కానీ వీటిని కాదని ప్రైవేటు సంస్థకు చెందిన భవనంలోనే ఏర్పాటు చేయడం వెనక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏఐ సిటీ 200 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం నిర్మాణ రంగంలోని పరిజ్ఞానం, వనరుల దృష్ట్యా రెండు లక్షల చదరపు అడుగుల్లో ఒక భవనాన్ని నిర్మించడమనేది అత్యంత సులువైన ప్రక్రియ. ఈ క్రమంలో అక్కడే ఒక తాత్కాలిక భవనాన్ని నిర్మించుకునే వెసులుబాటు కూడా ఉంది. ఏఐ సిటీ పూర్తయిన తర్వాత ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసిన భవనాన్ని కూడా వినియోగించుకోవచ్చు. అయినప్పటికీ అసంపూర్తి, ప్రైవేటు భవనాన్ని ఎంచుకోవడం వెనక అసలు ఉద్దేశం వేరే ఉందన్న చర్చ జరుగుతున్నది.

స్క్వాల్ ఫార్మేషన్‌తోనే కూలిన చెట్లు

- పునరుద్ధరణ జరగాలంటే వందేండ్లు
- నిర్ధారణకు వచ్చిన అటవీ శాస్త్రవేత్తలు
- విపత్తును పసికట్టిన వన్యప్రాణులు

ములుగు, సెప్టెంబర్ 25 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంతోపాటు అరేబియా సముద్రంలో గత నెల 31న ఏర్పడిన తుఫాన్‌ల కారణంగా గంటకు 125 కిలోమీటర్ల వేగంతో వీచిన భారీ గాలుల ఒత్తిడితో ఏర్పడిన స్క్వాల్ ఫార్మేషన్‌తోనే ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవిలో భారీ ఎత్తున చెట్లు నేలకూలాయని అటవీ శాఖ పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో అటవీశాఖ అధికారులతోపాటు 10 నుంచి 12 సంస్థలకు చెందిన నిష్ణాతులైన శాస్త్రవేత్తలతో వర్క్‌షాపు నిర్వహించి విధ్వంసానికి గల ప్రధాన కారణాలను అంచనా వేశారు. తాడ్వాయి, మేడారం, పస్రా అటవీ ప్రాంతంలో ఆగస్టు 31న జరిగిన దుర్ఘటన వల్ల 332 హెక్టార్లలో అడవికి నష్టం జరిగి 50 వేలకు పైగా చెట్లు నేలకూలాయని చెప్పారు. ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.30 కోట్ల నష్టం జరిగిందని, కలపతో కలుపుకుంటే రూ.100 కోట్ల నష్టం వరకు ఉంటుందని తెలిపారు. పర్యావరణం దృష్టితో చూస్తే రూ.100 కోట్లకు పైగా నష్టం జరిగిందని పేర్కొన్నారు. దట్టమైన 100 నుంచి 200 ఏండ్ల చెట్లు కూలాయని, అంతటి దట్టమైన అడవి తిరిగి రూపొందాలంటే వందేండ్లు పడుతుందని వివరించారు. నష్టం జరిగిన ప్రదేశంలో చెట్లను కాపాడుకుంటే ఐదేండ్లలో అడవి ఏర్పడుతుందని, భారీ వృక్షాలు కావాలంటే చాలా సమయం పడుతుందని పేర్కొన్నారు. రెండు ప్రాంతాల్లో ఒకేసారి వచ్చిన తుఫాను వల్ల భారీ ఒత్తిడితో గాలులు వీచి మేఘాలు ఒక దానిపై ఒకటి వచ్చిన సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతాయని అధికారులు నిర్ధారణకు వచ్చారని చెప్పారు. నష్టం జరిగిన రోజు సంఘటన ప్రాంతంలో 25 నుంచి 26 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతోపాటు గంటకు 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని, కొంత ప్రాంతంలో 160 నుంచి 170 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచినట్టు కనుగొన్నామని తెలిపారు. వర్క్ షాపులో పాల్గొన్న శాస్త్రవేత్తలు ఎవరూ ఇంతటి తీవ్రతను చూడలేదని చెప్పారని వివరించారు. గతంలో మధ్యప్రదేశ్, అండమాన్, నికోబార్ దీవుల్లోని అడవుల్లో కొద్ది ప్రాంతంలో చెట్లకు నష్టం జరిగిందని, ప్రస్తుతం తాడ్వాయి అడవుల్లో భారీ మొత్తంలో నష్టం జరిగిందని చెప్పారు. చెట్లు కూలిన ప్రాంతంలో వన్యప్రాణులకు హాని జరగలేదని, విపత్తును ముందే తెలుసుకొని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్టుగా నిర్ధారణకు వచ్చామని పేర్కొన్నారు. దుర్ఘటనకు గల కారణాలపై నివేదిక రూపొందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు.

• ఆరోగ్య ప్రదాత కేసీఆర్

ఇటీవల విడుదలైన ఫలితాల్లో సింగరేణి వైద్య కళాశాల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణత సాధించడంపై రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య ప్రదాత కేసీఆర్ అని కొనియాడారు. - గోదావరిఖని

• పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి..



వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి రాంరెడ్డి కార్మికుల కాళ్లు కడిగారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. నెక్కొండ, ముదిగొండకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు బస్కె శ్రీనివాస్, ఒరుగంటి ప్రమీలను ఘనంగా సత్కరించారు. - నెక్కొండ